క్లుప్తంగా

ఎమ్మెల్యే కిలారి వినాయక చవితి శుభాకాంక్షలు

పొన్నూరు: నియోజక వర్గ ప్రజలకు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగి ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆరోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. వినాయకుని దీవెనలతో అంతా బాగుండాలని కోరారు. ప్రజలంతా మట్టి వినాయక ప్రతిమల్ని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పింఛన్ల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్–ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం పేదలకు పింఛన్లు, నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ బిల్డర్ కేసీహెచ్ అంకారావు మాట్లాడుతూ పేదలకు విలువైన సేవలు అందించడంలో అవోపా కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 108 మంది పేదలకు ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున నగదు, రూ.వెయ్యి విలువగల నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేశారు. పేద విద్యార్థికి చదువు నిమిత్తం రూ.10వేలు ఉపకార వేతనాన్ని అందజేశారు. అనంతరం ప్రముఖ వైద్యుడు కె. రామలింగేశ్వరరావు పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి వెచ్చా రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, కొత్తమాసు సుధాకర్, మద్ది సాయి రమేష్, మహిళా విభాగ అధ్యక్షురాలు చింతా వసంత కల్పన, నాళం కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక మహోత్సవం



పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాన్స్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక మహోత్సవం– 2 ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి సక్కు మాధవి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి డాన్స్ స్కూల్స్ చిన్నారులు పాల్గొన్నారు. లారెన్స్ గ్రూప్ డాన్స్ (దివ్యాంగులు), వెరైటీ డాన్స్, క్లాసికల్ డాన్స్, వెస్టర్న్ డాన్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. శివ మిమిక్రీ ఉత్సాహపరిచింది. శరణ్య, విజయ సాయి ఆలపించిన పాటలు అలరించాయి. అనంతరం డాన్స్ మాస్టర్ చంటి, డాన్సర్లకు మెమెంటోలను అందించి, సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి



నెహ్రూనగర్: బహుజనుల చైతన్యం కోసం అహర్నిశలు శ్రమించిన గొప్ప పోరాట యోధుడు పెరియార్ రామస్వామి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెరియార్ రామస్వామి జయంతిని పురస్కరించుకుని పాత గుంటూరులో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బహుజనుల చైతన్యం కోసం రామస్వామి జీవితాంతం పాటుపడ్డారని తెలిపారు. స్త్రీలు, పురుషులను సమానంగా పెంచాలని, ఉన్నత చదువులు చదివించాలని సూచించారన్నారు. మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ భావాల్ని పారదోలి బహుజనులను చైతన్యపరిచిన గొప్ప నాయకుడు పెరియార్ అని కొనియాడారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో 50మంది చేరిక



పార్టీలో చేరిన వారితో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, నేతలు

చేబ్రోలు: మండలంలో వడ్లమూడి గ్రామానికి చెందిన 50 టీడీపీ కార్యకర్తలు ఆదివారం పాల శివన్నారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వడ్లమూడిలోని షాదీఖానా ప్రారంభోత్సవానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయనున్నట్లు పార్టీలో చేరిన వారు ప్రకటించారు. కార్యక్రమంలో వడ్లమూడి గ్రామ సర్పంచ్ మోరంపూడి అనితా రాణి, ఉప సర్పంచ్ షేక్ హుస్సేన్, ముస్లిం మైనార్టీ నాయకులు పెద మస్తాన్, షేక్ జానీ, నియోజకవర్గ పరిశీలకులు అన్నా బత్తుని సదాశివరావు, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, కొక్కిలగడ్డ కిరణ్, కాసు ఈశ్వరరెడ్డి, చందు సాంబశివరావు, పొన్నూరు ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, భవనం వంశీరెడ్డి, షేక్ మాము, తుల్లిమిల్లి శ్రీనివాసరావు, గోళ్ల జ్యోతి, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పూజతో పర్యావరణ పరిరక్షణ

- పలు పాఠశాలల్లో మట్టి విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులు
- పట్టణ ప్రజలకు ఉచితంగా పంపిణీ



వీవా, వీవీఐటీ విద్యాసంస్థల్లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న బదిరీ ప్రసాద్



టీజేపీఎస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బ్రహ్మానికి ప్రతిమ అందజేస్తున్న సుధీర్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాల్ని పూజించాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం సూచించారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయకుని ప్రతిమల్ని ఆదివారం ఆయనకు ఎన్ఎస్ఎస్ అధికారిణి ఆర్. జయశైలజ అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రంగులు, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వంటి మెటీరియల్‌తో తయారు చేసిన విగ్రహాల్ని పూజించిన అనంతరం నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితం అవుతుందని తెలిపారు. వినాయకచవితి పండుగ రోజున మట్టి వినాయకుని ప్రతిమల్ని పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారవుతామని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీ పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో...

వినాయకచవితి పండుగను పర్యావరణానికి హాని కలిగించని విధంగా జరుపుకోవాలని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో ఆదివారం విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మట్టి వినాయకుని ప్రతిమల్ని పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. సహజ సిద్ధమైన రంగులు, మట్టిని ఉపయోగించి తయారు చేసిన విగ్రహాలనే పూజించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

వీవా, వీవీఐటీ స్కూలులో...

నవభారత్‌నగర్‌లోని వీవా, వీవీఐటీ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన రెండు వేల మట్టి వినాయకుని విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు విద్యాసంస్థల కార్యదర్శి సూర్యదేవర బదిరీ ప్రసాద్ తెలిపారు. వినాయకచవితి వేడుకల్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ నినాదంతో వీవా, వీవీఐటీ విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్, శాఖ విద్యార్థులు గత 12 ఏళ్లుగా ఉచిత విగ్రహాల పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకుని విగ్రహాలనే పూజించాలని, తద్వారా సంస్కృతి, సంప్రదాయాల్ని భావితరాలకు అందించగలమని తెలిపారు.

29వ డివిజన్‌లో..

నెహ్రూనగర్: మట్టి ప్రతిమలతో వినాయక చవితి పండుగ ప్రతి ఒక్కరు జరుపుకోవడం ద్వారా పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామని 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ తెలియజేశారు. శ్రీ కుమార స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్‌లో మట్టి ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనక రంగులతో తయారు చేసిన విగ్రహాల్ని ఏర్పాటు చేయడం ద్వారా కాలుష్యంతో పాటు పర్యావరణ పరిరక్షణకు భంగం కలుగుతుందని తెలిపారు.

గణనాథుడి పూజకు వేళాయె..



ప్రత్తిపాడులో భారీ గణనాథుడిని మండపంలోకి తరలిస్తున్న యువకులు



ప్రత్తిపాడులో సిద్ధమైన భారీ మండపం

- వినాయకచవితికి సిద్ధమైన ప్రజలు
- లంబోదరుడిని కొలువుదీర్చేందుకు ప్రత్యేక మండపాల ఏర్పాటు

ప్రత్తిపాడు: వినాయక చవితి పూజలకు సర్వం సిద్ధమైంది. గజాననుడిని భువి నుంచి దివికి ఆహ్వానించేందుకు ఊరూవాడా ముస్తాబయ్యింది. పండుగ ఏర్పాట్లు గ్రామాల్లో దాదాపుగా పూర్తయ్యాయి. పలు ప్రధాన కూడళ్లలో యువకులు, విగ్రహ కమిటీలు గణపతి నవరాత్రుల నిర్వహణకు పెద్దపెద్ద మండపాల్ని నిర్మించారు. విద్యుత్ దీపాలతో వినాయకుని కటౌట్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు పండుగశోభను తెచ్చాయి. స్థానిక విఘ్నేశ్వరాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

పత్రితో పూజించేందుకు..

పూజలకు కావలసిన గణపతి విగ్రహాలు, పత్రి, పండ్లు సమకూర్చుకునే పనిలో పిల్లల నుంచి పెద్దల వరకు నిమగ్నమయ్యారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు విగ్రహాల్ని నిర్వాహకులు ఇప్పటికే కొనుగోలు చేశారు. గృహాలకు అవసరమైన చిన్నచిన్న విగ్రహాలను తోపుడుబండ్ల మీద వ్యాపారులు విక్రయిస్తున్నారు. చిన్నారులు సైతం తమ పుస్తకాలలో వినాయకుని చిత్ర పటాలను గీసి వాటికి రంగులద్ది ఓబొజ్జ గణపయ్యా.. నీ బంటు మేమయ్యా.. అంటూ ఏకదంతుని శ్లోకాల్ని రాసుకుని పూజలకు సిద్ధమయ్యారు. వినాయక చవితి సందర్భంగా పండ్లు, పూజా ఫలాలకు రెక్కలొచ్చాయి.

సామరస్య వాతావరణంలో పండుగ

సామరస్య వాతావరణంలో వినాయకచవితిని జరుపుకోవాలని ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్రబాబు తెలిపారు. మండలంలోని పదహారు గ్రామ పంచాయతీల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను పరిశీలించారు. కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఎన్ని రోజులు వేడుకలు నిర్వహిస్తారు? నిమజ్జనం తేదీల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను అనుసరించి, ఇబ్బందులు తలెత్తకుండా సామరస్యపూర్వక వాతావరణంలో సంప్రదాయబద్ధంగా ఉత్సవాల్ని జరుపుకోవాలని కమిటీలకు సూచించారు. సమస్యలు తలెత్తితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం

పొన్నూరు: విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని ఉత్సవాలకు పొన్నూరులోని ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో విఘ్నేశ్వరునికి విశేష పూజలు నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. మండపాల్ని అందంగా అలంకరించి గణనాథుడ్ని ప్రతిష్ఠించారు. వినాయక విగ్రహాలు, పూలు, పత్రి, పండ్లు, పూజ సామగ్రి కొనుగోలుకు భారీగా జనం తరలిరావడంతో పట్టణంలోని చిన్నరామ మందిరం సెంటర్, షరాఫ్ బజార్, కూరగాయల మార్కెట్, ఐలాండ్ సెంటర్, రైతు బజార్లు కిటకిటలాడాయి. భారీ విగ్రహాలతో పాటు, చిన్న విగ్రహాల అమ్మకాలు అమాంతం పెరిగాయి. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పర్యావరణాన్ని కాపాడేందుకు ఉచితంగా వినాయకుని మట్టి విగ్రహాల్ని పంపిణీ చేశారు.



పొన్నూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు



పొన్నూరులో వినాయకుడి పూజకు సిద్ధమవుతున్న మండపం

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 20, 21వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను మాలలంతా విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం 'హలో మాల.. చలో ఢిల్లీ' కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం కాలం చెల్లిందని, కాని కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి అన్నదమ్ముల్లా కలసి ఉన్న మాల, మాదిగల్ని విడగొట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోదా జాన్‌పాల్, దారా హేమప్రసాద్, సొంగా వెంకటరమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టుల్ని భర్తీ చేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో వి. సుజాతాదేవి తెలిపారు. ప్రత్తిపాడు మండలంలోని నడింపాలెం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం (బీసీ–బి), గనికపూడి డీడబ్ల్యూ కేంద్రం (ఎస్సీ), పెదనందిపాడు బీసీ–1 కేంద్రం (బీసీ–బి), వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరు వడ్డెరపాలెం కేంద్రం (బీసీ–బి)లో ఖాళీలున్నట్లు ఆమె పేర్కొన్నారు. దరఖాస్తుదారులు 2023 జులై ఒకటో తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల మధ్య వయస్సుతో పాటు స్థానిక నివాసులై, వివాహితై ఉండాలనని పేర్కొన్నారు. ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ప్రత్తిపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వివరణలో నిజం లేదు: డాక్టర్ ఆలా

గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రార్ డాక్టర్ రాధికరెడ్డి విడుదల చేసిన ప్రతిక ప్రకటన అసత్యమని మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో 53,857 ర్యాంకు సాధించిన బీసీ (ఏ) అభ్యర్థికి రిజర్వేషన్ కేటాగిరిలో సీటు కేటాయించి, 60,407 ర్యాంకు సాధించిన అగ్రకుల అభ్యర్థికి ఓపెన్ కేటగిరిలో సీటు కేటాయించడం వాస్తవమా..కాదా? అని ప్రశ్నించారు. యూనివర్సిటీ అడ్మిషన్ల నిబంధనల్ని పూర్తిగా అమలు చేయలేదని తెలిపారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు కేసన శంకరరావు, ప్రముఖ న్యాయవాది వైకే పాల్గొన్నారు.

నెలాఖరు నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియా గ్రేస్



పాతమల్లాయపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా చేస్తున్న వైద్య పరీక్షలు

ప్రత్తిపాడు: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఈ నెల 30 నుంచి ప్రారంభమై అక్టోబరు 30 వరకు జరగనున్నాయని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెజియా గ్రేస్ తెలిపారు. అందులో భాగంగా ఈనెల 30 న పాతమల్లాయపాలెంలో, అక్టోబరు 3న వంగిపురం, 5న కోయవారిపాలెం, 7 ప్రత్తిపాడు–బి, 10న తిక్కిరెడ్డిపాలెం, 12న ప్రత్తిపాడు–1, 17న ప్రత్తిపాడు–ఏ, 19న యనమదల, 21న నడింపాలెం–2, 26న గొట్టిపాడు, గనికపూడి, 27న చినకోండ్రుపాడు, నడింపాలెం, 30న తుమ్మలపాలెంలో శిబిరాలు జరగనున్నట్లు చెప్పారు. గొట్టిపాడు పీహెచ్‌సీ ఒక టీంగా, ప్రత్తిపాడు పీహెచ్‌సీ రెండవ టీంగా ఏర్పడి గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం క్యాంపుల్లో అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు.

పాతమల్లాయపాలెంలో డోర్ టు డోర్ సర్వే

క్యాంపు జరిగే తేదీకి పదిహేను రోజుల ముందు నుంచి నిర్దేశిత గ్రామాల్లో ముందస్తుగా సర్వే నిర్వహిస్తామని కెజియాగ్రేస్ తెలిపారు. అందులో భాగంగా మండలంలో మొదటిగా పాతమల్లాయపాలెంలో ప్రారంభించామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తున్నారని వివరించారు. కుటుంబంలోని సభ్యుల ఆరోగ్య వివరాలు, పరిస్థితిని తెలుసుకుని, సమస్యలుంటే ఏడు రకాల పరీక్షలు అక్కడికక్కడే నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం వైద్యులు పరీక్షించి చికిత్స అందిస్తారని ఆమె తెలిపారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కెజియాగ్రేస్ కోరారు. సిబ్బంది కూడా అలసత్వం లేకుండా సర్వే చేయాలని ఆదేశించారు.

మట్టి వినాయకుడ్ని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడదాం

బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6,300 మట్టి వినాయకుడి ప్రతిమల పంపిణీ



పట్టాభిపురంలో ప్రతిమలు అందిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

నగరంపాలెం: మట్టి వినాయకుడిని మనసా వాచా కర్మణా పూజించి, రాష్ట్రమంతటా ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ముందడుగు వేద్దామని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. 'మట్టి వినాయకుడిని పూజిద్దాం' అనే నినాదంతో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి గణపతి ప్రతిమల పంపిణీ అట్టహాసంగా జరిగింది. గుంటూరు నగరంలోని పట్టాభిపురంలో 4,500, పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో 1,300, దండమూడిలో 500 మట్టి వినాయకుని ప్రతిమలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వినాయకచవితి పర్వదినానికి– ప్రకృతికి అవినాభావ సంబంధం ఉందని, దాన్ని మన పూర్వీకులు వేల సంవత్సరాల క్రితమే ఆచారంగా అందించారని తెలిపారు. గణేశుని పూజా విధానంలో అనేక ఆయుర్వేద నియమాలు, ఆరోగ్య సూత్రాలు, పలు రకాల వ్యాధులకు ముందు జాగ్రత్తలు నిక్షిప్తమై ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలంతా మట్టి గణపతి ప్రతిమను పూజించడం ద్వారా పండుగ మరింత శోభాయమానంగా విరాజిల్లుతుందని చెప్పారు. దీంతో ప్రాకృతిక పూజా ద్రవ్యాలు, సంబరాలతో సంపూర్ణ పర్యావరణహితంగా మారుతుందని వివరించారు. గణనాథుడి పండుగను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని నిలపాలని సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు దృష్ట్యా రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ మద్దతు, సహకారాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. గత రెండేళ్లుగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్నామని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు జి.సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.సమీర్‌నందన్ పాల్గొన్నారు.